# పొగరుబోతులు

వేసవి చివరి రోజుల్లో ఒక మిట్ట మధ్యాహ్నం ఒక బస్సు ఒక చిన్న పట్టణం నించి బయలుదేరింది. ప్రైవేటు బస్సు. పాత బస్సు పూతబూసి పైకి చక్కదనంగా కనిపిస్తున్నా, లోన లొటలొటలాడిపోతోంది. ఏ సీటూ సరిగ్గా లేదు. రెండు ప్రక్కల నున్న పరదాలూ చిరిగే వున్నాయి. ఆ వూర్లో ఒక నాయకుని చావుకు సంతాపం తెలియజెయ్యడానికి పై వూర్లనించి వచ్చినవాళ్ళు కూడా కొందరీ బస్సునే పట్టుకున్నారు. అందుకే బయలుదేరిన చోటే బస్సు నిండిపోయి మనుషులు లోన నిల్చునే వున్నారు.

పట్నం దాటేలోగా ఎక్కడ మనిషి నిల్చొని చెయ్యి వూపితే డ్రయివరు అక్కడ బస్సు నిల్చోబెట్టేస్తున్నాడు. కండక్టరు మనుషులను మేకలనుకుని లోపలికి కుక్కుతున్నాడు. ఎవరో లోపలి నించే అప్పుడే అరుస్తున్నాడు. "ఇంకా ఎక్కిస్తున్నావా బాబూ? దేముడా, పైసాలిచ్చి పాపం కొనుక్కుంటున్నాంరా! మా మొర ఆలకించు."

"అసలు పాపం ఆలోచించినావా?'' అన్నాడొకడు.

''అదేంటది?''

''కొబ్బరిసెగ తగిలినట్లు నీకు యెండ తగల్లేదా? ఈ ఏడాది వానజల్లు కురిసిందా? వానలు కురిస్తేనే వసుంధర అంటారు పెద్దలు."

"వానలెలాగొస్తాయ్, దానధర్మాలు ధరణినించి పోతంటే!''

"వానలు యెగ్గొడ్తే మంటలు, ఎక్కువైతే వరదలు'' ఇంకో గొంతుక అరచింది.

''వాన రాకడా, ప్రాణం పోకడ యెవరెరుగుదురులే!'' మరో గొంతుక.

బస్సు పట్నం దాటింది. త్రోవలో అక్కడక్కడా ఆగుతూనే వుంది. మనుషులు యెక్కుతున్నారు గానీ దిగలేదు. కొంతదూరం బస్సు నడిచాక, కొండల చాటున దాగున్న కారుమబ్బులు గడగడా వచ్చి మీద పడ్డాయ్. ఎడ తెరిపిలేని వర్షమైనా మధ్యలో బస్సు ఆగుతూనే వుంది. మనుషులు యెక్కుతునే వున్నారు.

''పాపం కొనుక్కున్న యీ పేసింజిర్లో యెవరో ఒక పుణ్యాత్ముడు న్నాడు. మనిషి ముకం చూసి మొదలు తుది సెప్తావంటావు కదా, ఆ పుణ్యా త్ముడ్ని సూపించగలవా?" అన్నాడొకడు పక్కవానితో.

అంతవరకూ నిల్చున్న ఒక పదేళ్ళ అమ్మాయి ముఖంలో సుఖం లేదు. మోకాళ్ళలో బిగువులేనట్లు యేడుస్తూ కూర్చుండిపోయింది. వర్షం కుండపోతగా కురుస్తూనే వుంది. బస్సు నడుస్తునే వుంది. మధ్యలో ఆగుతూ పాసింజిర్లను యెక్కిస్తూనే వుంది. బయట తడసిన వాళ్ళు లోనా తడుస్తున్నారు. పరదాలు లాగినా వెలిసిరి లోనికి కొన్నిచోట్ల కొట్టుతున్నది. బస్సు టాపు నించి అక్కడ క్కడా చిమ్ముతున్న నీటి చుక్కలు రాలుతున్నాయ్. ఒకచోట వెనుక సీటుపై ఆకాశధారలా నీరు పడ్తోంది. అయినా, బస్సు ఆగిపోలేదు. పండు మీసాల డ్రైయివరు, నోటిలో జానెడు చుట్టపెట్టి వుషారుగా నడుపుతూ ప్రక్కనే ఒకనిని కూర్చోబెట్టుకున్నాడు.

త్రోవలో వర్షంలో యెక్కినా, ముందుకు డ్రయివరు దగ్గిర కూర్చున్న పోలీసువాడ్ని చూసి ''పైసాలిచ్చి మనం పాపం కొనుక్కున్నామా? ఒక్క పైసా యివ్వకుండానే అతగాడు పుణ్యం సంపాదించుకున్నాడు. అతగాడేనయ్యా పుణ్యాత్ముడు!'' అని సీటు మీద కూర్చున్న ఒక ఆయన యిదివరకు పాప పుణ్యాల గురించి మాటాడినవాడితో అన్నాడు.

''పోలీసోడు ఆలకి అయినోడు. అయినోలకి ఆకులో వడ్డించక, నేల కుక్కకి పెట్టినట్లు కుంభం పోస్తాడా?'"

"ఆదేటిరా, అసలు బస్సంటే యేటి? గేదనుకో. గేదెను కొనడంతో సరా? దానిని తోలడం అంత సులువు కాదు."

"ఏటయ్యా బలా మీద పడిపోతున్నావు? సరిగ్గా కూర్చో." పక్కవాడ్ని తోస్తూ కసిరాడొకాయన.

అతగాడు మేల్కొని, ఆవలింతలు తీస్తూ "రెండు రాత్రులు నిద్దర్లేదు. కంటిరెప్పలు సచ్చిపోనాయి" అన్నాడు.

"ఏల నిద్దర్లేదు?"

"నీవు లీడరునాగున్నావు. అందుకే అలాటి ప్రెశ్న యేస్తన్నావు?"

"నివ్వు నా మీదపడితే తప్పునేదు, నేను ప్రెశ్న వేస్తే తప్పొచ్చిందా?"

అవతలవాడికి బాగా తెలివి వొచ్చినట్లుంది. గట్టిగా అన్నాడు: "వాగి వర్షం తెచ్చిన పుణ్యాత్ముడితగాడే!"

"ఏటి! మర్యాద మంచీ లేకండ అలా వాగుతున్నావు?" కళ్లెర్రజేశాడు లీడరు.

"లీడరంటే తప్పేటయ్యా. బస్సులో వున్న యావన్మందిని అడుగు. లీడరు తంతేమిటి? ప్రెశ్న లేస్తాడు, సమాధానాలు సెప్పడు. నివ్వు బస్సెక్కిన దగ్గరనించి ఆదే సేస్తన్నావు కదా!"

"నివ్వే మాటకారివి, నివ్వే లీడరివి."

వెనుక నించి ఒకడు "బాబూ, మీరిద్దరూ లీడర్లులాగే వున్నారు. రెండు వేరు వేరు పార్టీల లీడర్లు ఒక సీట్లో కూర్చున్నారు కానీ, యిద్దరూ ఒకటే" అని అరిచాడు.

"ఏటయ్యా ఒకటి? నా అంతస్థు యెక్కడ, వాడి అంతస్తెక్కడ?" అని పెద్ద లీడరు వురిమాడు.

"ఇద్దరూ మాంసం ముక్క మా మధ్యకి విసిరి, మాలో మేం కొట్టుకున్నట్లు సేస్తున్నారు. మరి తమరిద్దరూ లీడర్లు కాకపోతే యింకెవరు?" వెనుక నించి అరుపు.

ఇంతలో ఆ పదేళ్ల అమ్మాయి గోల. పక్కనే నిల్చున్నవాడు చప్పున ఆతృతతో కూర్చుండిపోతే "నీకేం మతిపోయిందా? నా కాళ్లు తొక్కేశావు" అని పెద్ద లీడరు కేక.

"ఏమైందిరా?" అని రెండో లీడరు అడిగాడు.

వాడు యెవరికీ సమాధానం చెప్పకుండా ఆ అమ్మాయి కడుపు నిమురుతూ "వూరుకో తల్లీ, వూరుకో అమ్మా!" అని ఓదారుస్తున్నాడు.

"బుద్ధి లేదురా. వంట్లో నిమ్మళం లేని పిల్లని, కిక్కిరిసిన బస్సెక్కిస్తావా?"

తలమీద చిన్న పాగా, మాసిన పంచ యెత్తి కట్టాడు. ఖద్దరు బనియను వాడిని చూసి పెద్ద లీడరు "కడుపులో నొప్పా?" అని ప్రశ్నించాడు. వాడు జవాబు చెప్పడు. కోపంగా "చెవుడా! బుద్ధీ బుర్ర వుండక్కర్లేదా? జబ్బు మనిషిని యీ రద్దీలో యిరికిస్తావురా. ఈ ఎక్స్‌ప్రెస్‌లో యెందుకెక్కావు? ఎక్కడికి ఎక్కడికి వెళ్తావురా?" ప్రశ్నల వర్షం కురిపించాడు.

"సికాకుళం."

"చెవిటివాడు కాదండీ, పొగరు. ఈ రోజుల్లో యెవర్నీ యెందుకని అడగడం తప్పు. ఉన్నది సున్నాగానీ, పపురుషాలుకేం లోటు లేదు. చూశారా, ఇదంతా కూర్చోడానికి ఆ పిల్లకి చోటిస్తారనే యేషాలండీ! కడుపు నొప్పంటే సూడొచ్చామా? కనపడని జబ్బంటూ సెప్పి, సీటు కాజెయ్యాలని చూస్తున్నాడు. వాడు తెలివైనవోడా మనం తెలివైన వాళ్లమా?" ఉపన్యాస ధోరణిలో ఆ పెద్ద లీడరు అరిచాడు.

"ఆ కడుపు నొప్పేదో యిప్పుడే తేలిపోతాది. బస్సు ఆగింది కదా! ఏమోయ్, సోడా పట్టు, కడుపు నొప్పి తగ్గుతాది." రెండో లీడరన్నాడు.

వాడు మాటాడడు. పిల్ల మాటాడదు. పిచ్చిదానిలా చూస్తోంది. ముక్కులో చీమిడి కారుతోంది. ముఖంలో కళ్లు నీటిలో మునిగివున్నాయ్. వర్షం నించి తడిసిన రెండు జానల జుత్తు విరబోసి వుంది.

"చూశారా! సోడా పట్టమంటే పట్టలేదు. దానికేం కడుపునొప్పి లేదు. అంతా వేషం. లేవయ్యా - లే - కింద కూర్చుని ముగ్గురు నిల్చున్న జాగా మింగేశావు. లేస్తావా? లేదా?"

వాడు నిల్చుని "నన్ను మట్టేశారు నా పిల్లని మట్టికండి బాబూ!" అన్నాడు.

"జబ్బా గిబ్బా లేదు - దాన్ని నిలబెట్టు. మరో యిద్దరు నిల్చునే సోటుంటాది. సూసావా? ఒకరి మీద ఒకరు. ఆడా మగా అంతా యేకమై పోనారు."

"ఎవరి ఆతృత ఆళ్లది! మరేం సెయ్యడం?" అని లీడరు సీటుకు ఆనుకుని నిల్చున్న ఒక వయసులో వున్న ఆవిడ నిస్పృహ!

బస్సుతోపాటు కారుమేఘాలు కదులుతూ వర్షం యింకా తెరిపి యివ్వలేదు. బస్సులో గోలా తగ్గలేదు. ఈ గోల జోలపాటలా వుందేమో చిన్న లీడరు మళ్ళీ కునుకు పాటల్లో పడి పెద్ద లీడరు మీద ఒరిగిపోయాడు. గట్టిగా తట్టి లేపి "ఏమీ యీ యేషం? ఎవడ్ని అనుకున్నావ్?" అన్నాడు.

ఆవులింతలు తీస్తూ మేల్కొని "అటు ఆయమ్మని యేటీ అననోడివి - ఇటు నేను పడితేనా తప్పు?"

"ఒంటిమీద ధ్యానం పెట్టుకుని మాటాడవయ్యా! - తాగున్నావా యేటి?"

"నిజం పలికితే తాగినానంటావేటి?"

"ఆయమ్మ సిస్టర్ చెల్లెలు లాంటిది. ఆడాళ్ళని గౌరవించడం నేర్చుకోవయ్యా!"

"నీ సిస్టరైతే నీవు యిలా కూర్చుంటావా? లే .... లే .... ఆయమ్మకి సీటు యిచ్చే."

"మొగాడి పక్కన కూర్చుంటాదా? ముందు నీవు లేచి సీటు యిచ్చే."

"బాబ్బాబులు... మీ యిద్దరు నేసిపోతే-ఆయమ్మా నా కూతురూ యిద్దరూ కూకుంటారు." ప్రాధేయపడ్డాడు ఆ పదేళ్ళ పిల్లతండ్రి.

ఇద్దరు లీడర్లూ ఒకరి నొకరు చూసుకుని కళ్ళెర్ర చేశారు. ఎవరూ లేవ లేదు. పెద్ద లీడరు ప్రక్కన నిల్చున్న ఆడది మెల్లగా బస్సు వెనుకకు జారి పోయింది. పదేళ్ళ పిల్ల పిచ్చిదానిలా చూస్తూనే వుంది. అప్పుడప్పుడూ కళ్ళల్లో తడి ఆరకుండా యేడుస్తూనే వుంది.

వర్షం బీభత్సం కాస్త తగ్గింది. అరవకుండానే మాటలు వినిపిస్తున్నాయ్, మీదపడుతున్న నిద్దర మత్తు మనిషిని తోసేస్తూ లీడరు—

"నల్లమందు మింగావా? నిద్దర మాత్రలు వేసుకున్నావా?" అన్నాడు.

"కలలోనైనా సొరగం సూద్దామని."

"తెలివొస్తే యింకేంటుంది యీ పెపంచకంలో? తిట్టుకోడాలు, కొట్టుకోడాలు, పీకలు తెగేసుకోడాలు - ఇంతకన్నా నరకం యెక్కడుంటాది?" ఈ మాటలు విన్న వెనుకవాడు "కుల గోత్రాలు వేరైనా మలమూత్రాలొక్కటే కదా - ఎందుకిలా మనుషులు పోట్లాడుకుంటారో?" అన్నాడు.

"ఒరే సామీ! ఇంతకీ వర్షం తెప్పించిన పుణ్యాత్ముణ్ణి యిప్పటికైనా పోల్చుకున్నావా?" అని మొదట వేసిన ప్రశ్న గుర్తుకు తెచ్చి అడిగాడు.

"పుణ్యం యెలా గొస్తాది? ఆర్జించాలయ్యా - ముఖం సూసి అతగాడేం సెప్తాడు?" పెద్దలీడరు ఖస్సుమన్నాడు.

"నేను మూడుసార్లు కాశీ వెళ్ళాను."

"నేను పతి యేడూ తిరుపతి మొక్కు సెల్లించుకుంటాను."

"నేను వూర్లో పిల్లల సదువుకని బడి కట్టిస్తామంటే - యెకరా మెట్టురాసి చ్చేశాను" అన్నాడు లీడరు. ఎవరో 'అబద్ధం' అన్నట్లు వినిపించింది.

ఎవరో కాదు తనలో తానే అనుకున్నాడు.

"మీరంతా దానాలు సేసి, కాశీ పోయి పుణ్యాత్ములై పోతే, మాలాటి అనాదులేమౌతారు బాబో?" వెనుకనుంచి యింకెవడో ప్రశ్న వేశాడు. అంతే కాదు - పాపాత్ముల గురించి ప్రశ్న వేశాడు.

"గతిలేక కడుపుకోసం దొంగతనం సేసినోలు, రంకూ బొంకూ నేర్సినోలు - అలంతా పాపాత్ములేనా బాబో? సదువుకున్న మారాజులు సెప్పండి."

జవాబు రాకండానే వర్షం తగ్గిపోయింది. శ్రీకాకుళం ప్రయివేటు బస్సు స్టాండులో బస్సు ఆగింది. నిల్చున్నవాళ్ళు దిగిన తరవాత పెద్ద లీడరు తన బరువైన శరీరాన్ని కప్పిన బట్టలను దులుపుకుంటూ దిగేసరికి యేం చూశాడు?

ఆ పదేళ్ళ పిల్ల పక్కన నిల్చున్న తండ్రి. ఆ తండ్రి పక్కన బస్సులో చూసిన పోలీసువాడు.

"నేననుకున్నాను, వీడు దొంగ వెధవ అని. ఇద్దరూ కలిసి యేదో దొంగ తనం చేసుంటారు" అనుకుని జేబులో తన పర్సు వుందో లేదో అని ఒకసారి తడుముకున్నాడు.

''హమ్మయ్య - అపకారం జరగలేదు.''

అంతలో పోలీసు ''టీ తాగి వస్తాను - ఇక్కడ కూర్చోరా'' అని వెళ్లాడు.

పెద్దలీడరు వాడి దగ్గరకు వెళ్ళి అడిగాడు:

''పోలీసోడు యెంటొచ్చాడు, ఏటిరా సంగతి?''

''ఏటి సెప్పుకుంటే ఎవరు నమ్ముతారు?''

''నేను నమ్ముతాను....సెప్పరా!''

''తమరి ఊరూ పేరూ ముందు సెప్పండి.''

''మా ఇంటిమీద పడ్తావా?''

"ఉన్న పాటున పోలీషుటేషిను నించి వచ్చిసినాం. సేత సిల్లిగవ్వలేదు. ఒక పది రూపాయలు అప్పు ఇప్పించండి. తమకింటికొచ్చి ఇచ్చేస్తాను.''

''నీకా అప్పు? నివ్వేటి తీరుస్తావులే. ముందు ఒక మాట సెప్పు - ఏటి తప్పు సేసినావు?''

''నానా తప్పు .... తప్పు సేసిన యెదవ, కాపీహోటలు యెదవ - మా సుట్టాల కుర్రాడే....''

''ఏం సేశాడు? ఆడు సేస్తే నీ యెంట పోలీసు లేల?''

''నా కూతురు బతుకు అల్లకల్లోలం సేసినాడు.''

''ఇంత సిన్నపిల్ల బతుకెలాగు అల్లకల్లోలం సేస్తాడు రా?''

''నీ కెందుకులే బాబూ?''

''ఇంతకి యేం సేసినాడురా?''

''పొగరుబోత్తై పోనాడు. పొరపాటు ఆలోచనలో దిగినాడు.''

''నానుస్తా వెందుకురా? అసలు జరిగిందేటి నిజం సెప్పరా?''

''ఇంకా అర్థం సేసుకోనేదా బాబో? ఆ కాపీ హోటల్లో నా కూతురు గిన్నెలు కడిగేది. నూనూగు మీసాల ఆ యెదవకి పోయేకాలం వచ్చింది. నా కూతురిని రేపు సేసినాడు రేపు.''

''రేపా? ఇంత నిన్ని పిల్లనా? నేను నమ్మనురా?''

''ఈ పట్నంలో ఆడ డాక్టరమ్మ ఉన్నది కదా, పరీక్షకి పోలీసుబాబు తెచ్చినాడు.''

''ఎంత అమాయకుడివిరా! బస్సులో ఈ మాట సెప్పివుంటే ఎవ్వరికైనా కనికారం పుట్టి సీటు యిచ్చేవారు కదా?''

''ఆ నిసం సీటుకోసం, పదుగురి మద్దిన, నా పిల్ల పరువు కాల్సాలా?''

''ఇప్పుడు పోలేదా మరి?''

''బస్సులో ఉన్నోలు వాడవాడోలు కదా! ఈ వైనం అన్ని దిక్కులా పాకివేయదా? రేపు పొద్దున్న ఈ పిల్ల ఎదిగితే సంబంధాలు వస్తాయా? బస్సులో ఈ మాట సెప్పినా, తమరు లేసిపోయి సీటు ఇచ్చుందురా?''

అప్పుడే పోలీసువాడు తిరుగవచ్చాడు. ''ఈ పిల్లని ఎవడో రేపు నేసాడంటున్నారు, ఇది నిజమేనండి జవానుగారూ?''

"నిజమే.''

నాలుగడుగులు వేసి తిరుగవచ్చి ఆ పెద్ద లీడరు "ఇందరా, ఈ రూపాయి కర్సు పెట్టుకో'' అని వాడి బనియను జేబులో పెట్టి వెళ్ళిపోతుంటే వాడు లీడరు వెంటపడి ఆపి అన్నాడు: ''నా కూతురిని ఆ పొగరుబోతు రేపు సేసినాడు. నీవు నన్ను రేపు సేస్తావా? ఇది నీకు నాయమా?''

''కాపీ తాగమనిస్తే అవేటిరా ఆ రేపు మాట?''

''పది రూపాయలు అప్పు అడిగితే నన్ను నమ్మావు కాదు. నాను అడుక్కునోడ్ని కాను. ఒక్కనాడు ఓటుకి నోటు పుచ్చుకోలేదు. మరియాదగా బతుకుతున్నా అదిగో, అడుక్కుంటున్నవోలు అక్కడున్నారు, ఆలికేసి పున్నెం సంపాదించుకో'' అంటూ ఆ పాత రూపాయి నోటు లీడరు జేబులో కుక్కేశాడు. ''అప్పు ఇమ్మని ఆ పోలీసు బాబునే బతిమాలుతాను'' అనుకుంటూ వెనుకకు నడిచాడు. *

(1991)